ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
02-09-2024
సోమవారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 03 | పేజీలు : 8 | వెల : 4
JB జయభేరి



# వరద పరిస్థితులపై ఆరా..

## సీఎం రేవంత్ రెడ్డికి ప్రధాని మోదీ, అమిత్ షా ఫోన్ సాయం అందిస్తామని హామీ

**సీఎం రేవంత్ రెడ్డితో ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఫోన్ లో మాట్లాడారు. తెలంగాణలో వరద పరిస్థితులపై ఆరా తీశారు. కేంద్ర తరపున అవసరమైన వరద సహాయక చర్యలు అందిస్తామని ప్రధాని మోదీ, అమిత్ షా హామీ ఇచ్చారు.**

సీఎం రేవంత్ రెడ్డికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఫోన్ చేసి వరద పరిస్థితులపై ఆరా తీశారు. రాష్ట్రంలో వర్షాలు వరద పరిస్థితులను, జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు ప్రధాని మోదీ. పలు జిల్లాల్లో భారీ వర్షం.. వరదతో వాటిల్లిన నష్టాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా, ప్రాణ నష్టం జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన తక్షణ సహాయక చర్యలను.. తీసుకున్న జాగ్రత్తలను సీఎం రేవంత్ రెడ్డి ప్రధానికి వివరించారు. ఖమ్మం జిల్లాలో ఎక్కువ నష్టం సంభవించిందని ప్రధానికి తెలిపారు. ప్రాణ నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించినందుకు రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రధాని అభినందించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో సేవలు అందించే

...మిగతాది 2 లో

# అన్ని విద్యా సంస్థలకు సెలవు

## తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు.. ప్రభుత్వం కీలక నిర్ణయం..



**తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. వాగులు పొంగిపొర్లుతున్నాయి. వర్షాల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థలకు సెలవు ప్రకటించింది.**

తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న ఈ నేపథ్యంలో.. ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలకు సెలవు ప్రకటించింది. సెప్టెంబర్ 2 సోమవారం నాడు సెలవు ప్రకటిస్తూ.. నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం తొలుత హైదరాబాద్ నగరంలోని విద్యా సంస్థలకే సెలవు ప్రకటించింది. ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పరిస్థితిని

...మిగతాది 2 లో



విజయవాడ సింగ్ నగర్ లో సీఎం చంద్రబాబు పర్యటించారు. వరద ప్రభావిత ప్రాంతాలు పరిశీలించారు. బుడమేరు ముంపు ప్రాంతాల గురించి అడిగి తెలుసుకున్నారు. బోటులో వెళ్లి వరద బాధిత ప్రాంతాలు సీఎం చంద్రబాబు పరిశీలించారు.

# బోటులో ప్రయాణించి బాధితులకు భరోసా

✍ **జయభేరి, విజయవాడ :**

సింగ్ నగర్ లో బుడమేరు గండి పూడ్చే విషయాన్ని సీఎం చంద్రబాబు అధికారులతో మాట్లాడారు. వరద బాధితులందరినీ సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సీఎం ఆదేశించారు. ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విజయవాడ సింగ్ నగర్ లోని బుడమేరు వరద ప్రభావిత ప్రాంతంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించి, బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. విజయవాడలో బుడమేరు వాగు పొంగి పొర్లడంతో జలదిగ్బంధంలో ఉన్న సింగ్ నగర్ ప్రాంతాన్ని సీఎం చంద్రబాబుతో పాటు, రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, పి.నారాయణ, వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు వసంత కృష్ణ ప్రసాద్, బోండా ఉమామహేశ్వరరావు, యార్లగడ్డ వెంకట్రావు

...మిగతాది 2 లో





2 లో

# మున్నేరు వాగు మహోగ్రరూపం

## 15 కాలనీలు జలమయం ఇండ్లపైకి చేరి సాయం కోసం బాధితుల ఎదురుచూపులు



2 లో

# కోర్టు అంటేనే సామాన్యుల్లో భయం

- తీర్పు వచ్చే సరికి తరం మారుతోంది
- వాయిదాల సంస్కృతిని మార్చండి
- దీనిపై అధ్యయనం చేయండి
- న్యాయ వ్యవస్థకు ముర్ము హితవు

✍ **జయభేరి, న్యూఢిల్లీ, సెప్టెంబరు 1:**

కక్షిదారులకు సత్వర న్యాయం అందాలంటే కోర్టుల్లోని 'వాయిదాల సంస్కృతి'ని మార్చాల్సి ఉందని ఆదివారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభిప్రాయపడ్డారు. దీనిపై తొలుత దృష్టి పెట్టాలని న్యాయవ్యవస్థకు సూచించారు. ఇక్కడ రెండు రోజుల పాటు జరిగిన జిల్లా స్థాయి న్యాయవ్యవస్థ జాతీయ సదస్సు ముగింపు ఉత్సవంలో ఆమె ప్రసంగించారు. పెండింగ్ కేసులు 'మనందరికీ' పెద్ద సవాలుగా మారాయని అన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలంటే తొలుత కేసుల విచారణను వాయిదా వేసే విధానంలో మార్పులు రావాలని చెప్పారు.



# విజయవాడను చుట్టుముట్టిన వరద

**భారీ వర్షాలకు విజయవాడ అస్తవ్యస్తం అయ్యింది. వరద నీరు ముంచెత్తడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత 30 ఏళ్లలో ఎప్పుడూ లేని విధంగా విజయవాడలో రికార్డ్ వర్షపాతం నమోదైంది. బుడమేరు పొంగడంతో పలు కాలనీలు నీట మునిగాయి.**

✍ **జయభేరి, విజయవాడ :**

గత రెండు రోజులు కురుస్తోన్న భారీ వర్షాలకు విజయవాడ అతలాకుతలం అయ్యింది. నగరంలో రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదైంది. నిన్న ఒక్క రోజే 29 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో 30 ఏళ్ల రికార్డు బద్దలైంది. భారీ వర్షాలకు నగర జీవనం అస్తవ్యస్తం అయ్యింది. కాలనీలు, ఇళ్లలోకి నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు చోట్ల కొండ చరియలు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బాధితులు సాయం కోసం ఎదురుచూస్తున్నారు. విజయవాడను వరద నీరు ముంచెత్తింది. బుడమేరు ఉప్పొంగుతోంది. దీంతో బడమేరు 11 గేట్లు ఎత్తివేశారు. కవులూరు వద్ద బుడమేరు కట్ట తెగి వరదనీరు కాలనీల్లోకి ప్రవేశిస్తుంది. విజయవాడ నగరంలో రికార్డు స్థాయిలో వర్షం కురిసింది. దీంతో 30 ఏళ్ల

...మిగతాది 2 లో

# 150పైగా డ్రోన్లు కూల్చేశాం

✍ **జయభేరి, మాస్కో:**



ఉక్రెయిన్ తమపైకి భారీ సంఖ్యలో డ్రోన్ల దాడికి పాల్పడిందని రష్యా పేర్కొంది. శనివారం రాత్రి మొత్తం 158 డ్రోన్లను కూల్చేశామని రష్యా ఆర్మీ తెలిపింది. ఇందులో రాజధాని మాస్కోపైకి రెండు, పరిసరప్రాంతాలపైకి మరో దూసుకువచ్చిన తొమ్మిది డ్రోన్లు కూడా ఉన్నాయంది. సరిహద్దులకు సమీపంలోని కస్క్ ప్రాంతంలో 46 డ్రోన్లు, బ్రియాన్స్కలో 34, వొరెనెజ్‌లో 28 డ్రోన్లతోపాటు, బెల్గొరోడ్‌పైకి వచ్చిన మరో 14 డ్రోన్లను కూల్చినట్లు వివరించింది. సుదూర ట్వెర్, ఇరనొవో సహా మొత్తం 15 రీజియన్లపైకి ఇవి దూసుకొచ్చాయని తెలిపింది. బెల్గొరోడ్ రాజధాని ప్రాంతంలో ఉక్రెయిన్ ప్రయోగించిన క్షిపణితో 9 మందికి గాయాలయ్యాయి. కురకోవ్ నగరంపై రష్యా క్షిపణి దాడుల్లో ముగ్గురు చనిపోగా మరో 9 మంది క్షతగాత్రులయ్యారు. శనివారం రాత్రి రష్యా ప్రయోగించిన 11 క్షిపణుల్లో ఎనిమిదింటిని కూల్చివేసినట్లు ఉక్రెయిన్ వైమానిక దళం తెలిపింది.

# వర్షాలపై సోయిలేదు..



- మ్యానిఫెస్టోలో ఎన్ని హామీలు అమలు చేసిండ్రు?
- కేసీఆర్ ప్రజల్లోకి వస్తారంటేనే కాంగ్రెస్‌కు భయం
- మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్
- రేవంత్ భాషను మంత్రులకు నేర్పుతున్నరు
- హైడ్రాకు చట్టబద్ధత ఉన్నదా? : ఎమ్మెల్యే వివేకానంద

✍ **జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 1 :**

రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తూ ప్రజలు ఇబ్బందులు పడుతుంటే సీఎం,

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## మున్నేరు వాగు మహోగ్రరూపం

ఖమ్మం జిల్లాలోని మున్నేరు వాగు ఉగ్రరూపం దాల్చింది. దీంతో మున్నేరు పరివాహకంలోని 15 కాలనీలు పూర్తిగా జలమయం అయ్యాయి. బాధితులు ఇండ్లపైకి చేరి ప్రాణాలు కాపాడుకుంటున్నారు. తమను రక్షించాలని ఆర్తనాదాలు చేస్తున్నారు. భారీ వర్షాలు తెలుగు రాష్ట్రాలను అతలాకుతలం చేశాయి. వాగులు, వంకలు, కాలువలు, చెరువులు, నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వరద నీరు కాలనీల్లోకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఖమ్మం జిల్లాలో ఎడతెరిపి లేని వర్షాలతో మున్నేరు వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తుంది. దీంతో వాగు పరివాహకంలోని 15 కాలనీలు పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. రాజీవ్ గృహకల్ప, వెంకటేశ్వర్ నగర్, మోతీనగర్, బొక్కలగడ్డ కాలనీతో పాటు ఇతర ప్రాంతాల్లోకి భారీగా వరద పోటెత్తింది. ప్రజలు రెండు మూడు అంతస్తులున్న భవనాలపైకెక్కి ప్రాణాలు కాపాడుకుంటున్నారు. ఇండ్లపై నుంచి తమను రక్షించాలని బాధితులు వేడుకుంటున్నారు. వీడియోలు తీసి సోషల్ మీడియాలో పెడుతూ తమను రక్షించాలని ఆర్తనాదాలు చేస్తున్నారు. మున్నేరు పరివాహకంలోని కాలనీ ప్రజలు ఇండ్లపైకి చేరుకుని సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. వరద బాధితులు సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. అధికార యంత్రాంగం, సహాయ బృందాలు రంగంలోకి దిగాయి. బాధితులను రక్షించేందుకు చర్యలు చేపట్టాయి. మంత్రి తుమ్మల ఏపీ సీఎం చంద్రబాబుతో మాట్లాడారు. మున్నేరు వరద బాధితులను రక్షించేందుకు హెలికాప్టర్లను పంపాలని కోరారు. దీంతో మున్నేరు వద్దకు హెలికాప్టర్లు చేరుకున్నాయి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విశాఖ నేవీ అధికారులతో మాట్లాడి, ఖమ్మం నగరానికి నేవీ హెలికాప్టర్లను పంపాలని విజ్ఞప్తి చేశారు. విశాఖ నుంచి ఖమ్మంకు నేవీ హెలికాప్టర్లు చేరుకోనున్నాయి. మున్నేరు వాగు ఉద్ధృతి అంతకంతకూ పెరుగుతుండడంతో లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం అవుతున్నాయి. ఖమ్మం రూరల్ మండలంలోని జలగంనగర్, ఖమ్మం కాల్వొడ్డు ప్రాంతాల్లోకి మున్నేరు వరద నీరు పోటెత్తింది. దీంతో ఆ ప్రాంతాల్లోని ప్రజలు ఇండ్ల పైకి చేరి రక్షించాలని వేడుకుంటున్నారు. స్థానిక అధికారులకు వెంటనే స్పందించి సహాయ చర్యలు చేపట్టారు. ప్రకాశ్ నగర్ బ్రిడ్జి వైపున ఏడుగురు వరద నీటి ప్రవహంలో చిక్కుకుపోగా, వారిని రక్షించేందుకు సహాయ బృందాలు రంగంలోకి దిగాయి. వారి కోసం రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతుంది. మున్నేరు వాగు పూర్తి నీటి సామర్థ్యం కన్నా అత్యంత ఎక్కువగా ప్రవహిస్తుంది. మున్నేరు వాగు వంతెనపై నుంచి భారీ వాహనాలు, బస్సుల రాకపోకలను అధికారులు నిలిపివేశారు. ఖమ్మం నగరంలోని కవిరాజ్‌నగర్, వీడియోస్ కాలనీ, కోర్టు ప్రాంతం, ఖానాపురం హవేలీ, మమత హాస్పిటల్ రోడ్డు, కాల్వ ఒడ్డుతో పాటు పదుల సంఖ్యలో కాలనీలు నీట మునిగాయి. గత 20 ఏళ్లలో ఈ స్థాయిలో వరదలు చూడలేదని స్థానికులు అంటున్నారు. మున్నేరు వాగు వరదలో ఏడుగురు వ్యక్తులు చిక్కుకుని ఇబ్బందులు పడ్డారు. ఆకేరు వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తుంది.

## బాధితులకు భరోసా

సందర్శించారు. సహాయక చర్యలని పర్యవేక్షించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన సీఎం చంద్రబాబు... బుడమేరు మునక ప్రాంతంలో సహాయక చర్యలపై సమీక్షించారు. బుడమేరు వరద బాధితుల కష్టాలు తీర్చే వరకు విశ్రమించేది లేదని సీఎం స్పష్టం చేశారు. పాలు, అహారం, నీళ్లు, కొవ్వొత్తులు, టార్చ్‌లు వెంటనే అన్ని ప్రాంతాల నుంచి తెప్పించాలన్నారు. లక్ష మందికి సరిపోయే ఆహారం సరఫరా చేయాలని సీఎం ఆదేశించారు. ఇతర ప్రాంతాల నుంచి అదనపు బోట్లు, ట్రాక్టర్లు తక్షణం తెప్పించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. సహాయక చర్యలు వేగవంతం చేయాలన్నారు. తక్షణం అందుబాటులో ఉన్న ప్యాక్డ్ ఫుడ్ బాధితులకు అందించాలన్నారు. వృద్ధులు, పిల్లలను వరద ప్రాంతాల నుంచి వెంటనే తరలించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. విజయవాడలో ఉన్న అన్ని షాపుల నుంచి వాటర్ బాటిల్స్ తెప్పించాలన్నారు. బుడమేరులో ఊహించని స్థాయి వరదతో ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని, ప్రతి ఒక్క బాధితుడికి సాయం అందిద్దామన్నారు. సాయంలో ప్రతి రెండు గంటలకు మార్పు కనిపించాలని సీఎం చంద్రబాబు అన్నారు. అక్షయ పాత్ర నుంచి, సరఫరా చేయగలిగిన ఏజెన్సీల నుంచి ఆహారం తెప్పించాలని, ఖర్చు గురించి ఆలోచన చెయ్యకండని అధికారులకు స్పష్టం చేశారు.

## వరద పరిస్థితులపై ఆరా..

హెలికాప్టర్లను పంపిస్తామని ప్రధాని సీఎం రేవంత్ రెడ్డికి హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం తరపున అవసరమైన వరద సహాయక చర్యలు అందిస్తామని ప్రధాని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఫోన్ చేశారు. రాష్ట్రంలో వర్షాలు వరద పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో వరదలతో వాటిల్లిన నష్టాన్ని సీఎం రేవంత్ రెడ్డి.. అమిత్ షాకు వివరించారు. రాష్ట్రంలో వర్షాలు వరద పరిస్థితులను అమిత్ షా అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో వరదలతో వాటిల్లిన నష్టాన్ని సీఎం వివరించారు. ప్రాణ నష్టం జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని అమిత్ షాకు సీఎం తెలిపారు. అవసరమైన తక్షణ సాయం అందిస్తామని అమిత్ షా హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం తరపున అవసరమైన వరద సహాయక చర్యలు అందిస్తామన్నారు. రాష్ట్రస్థాయి అధికారులు, అన్ని జిల్లాల కలెక్టర్లతో నేరుగా మాట్లాడి ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని సీఎం రేవంత్ రెడ్డి సమీక్షిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని సీఎం భరోసా ఇస్తున్నారు. భారీ వర్షాలతో ప్రాజెక్టుల్లోకి వచ్చిన వరద నీటిని వృథా చేయకుండా భవిష్యత్తు అవసరాలకు వినియోగించుకునేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నిండిన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. వచ్చిన వరద నీటిని వీలైనంత మేరకు లిఫ్ట్ చేయాలని, రోజుకు ఒక టీఎంసీ తగ్గకుండా డ్రా చేయాలని సీఎం ఆదేశించారు. నంది, గాయత్రి పంప్ హౌస్‌ల ద్వారా లిఫ్ట్ చేసి రిజర్వాయర్లు నింపాలని ముఖ్యమంత్రి సూచించారు. మిడ్ మానేరు, లోయర్ మానేరు డ్యామ్‌తో పాటు రంగనాయక సాగర్, మల్లన్న సాగర్ వరకు జలాశయాల్లోకి ఏకధాటిగా నీటిని లిఫ్ట్ చేయాలని ఆదేశించారు. కడెం ప్రాజెక్టు, మిడ్‌మానేరు ప్రాజెక్టు, లోయర్ మానేరు డ్యామ్, అన్నపూర్ణ రిజర్వాయర్ ద్వారా రంగనాయక సాగర్‌కు తరలిస్తున్నారు. రంగనాయక సాగర్ నుంచి నీటిని పంప్ చేసి మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ నింపాలని.. అక్కడి నుంచి సింగూర్ ప్రాజెక్ట్, నిజాంసాగర్ ప్రాజెక్ట్ వరకు నీటిని తరలించాలని సీఎం ఆదేశించారు. కేంద్ర జల సంఘం మార్గదర్శకాల ప్రకారం మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్లలో అన్ని ముందు జాగ్రత్తలు పాటిస్తూ సాధ్యమైనంత వరకు నీటిని నిల్వ చేయాలని అధికారులను ఆదేశించారు.

## అన్ని విద్యా సంస్థలకు సెలవు

పరిగణలోకి తీసుకొని.. రాష్ట్ర వ్యాప్తంగా సెలవు ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా వానలు దంచికొడుతున్నాయి. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. కనీసం కాలు బయటపెట్టలేని పరిస్థితి నెలకొంది. భారీ వర్షాల నేపథ్యంలో.. అన్ని శాఖల అధికారులు అలెర్ట్ అయ్యారు. ముఖ్యంగా రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్, వరంగల్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, సూర్యాపేట, నల్గొండ, మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో కలెక్టరేట్లలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. తాజా పరిస్థితులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం అత్యవసర సమీక్ష నిర్వహించారు. మంత్రులు భట్టి, ఉత్తమ్, పొంగులేటి, తుమ్మల, దామోదర రాజనర్సింహ, జూపల్లి తదితరులతో ఫోన్లో రివ్యూ చేసి అప్రమత్తం చేశారు. సీఎస్, డీజీపీ, మున్సిపల్, కరెంట్, పంచాయతీ రాజ్, హైడ్రా, ఇరిగేషన్ అధికారులు 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని టెలి కాన్ఫరెన్స్ లో ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో.. సహాయక చర్యలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఫోకస్ పెట్టారు. సచివాలయం నుండి పర్యవేక్షిస్తున్నారు. ఎప్పటికప్పుడు పంచాయతీరాజ్, వైద్యారోగ్య శాఖ, జిల్లా కలెక్టర్లు, విపత్తుల నిర్వహణ శాఖ అధికారులతో సంప్రదింపులు జరిపి.. సూచనలు చేస్తున్నారు. అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను కలెక్టర్లు ఎప్పటికప్పుడు తెలుసుకొని.. చర్యలు తీసుకోవాలని సూచించారు. ఐఎండీ హైదరాబాద్ రిపోర్ట్ ప్రకారం... సెప్టెంబర్ 1 తెలంగాణలో చూస్తే ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, మహబూబాబాద్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ అయింది. సెప్టెంబర్ 3వ తేదీ వరకు రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆ తర్వాత తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు పడుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా వేసింది. ఈ సమయంలో ఎలాంటి హెచ్చరికలు లేవని తాజా బులెటిన్‌లో పేర్కొంది.

# చరిత్రలో ఎన్నో చేదు అనుభవాలు!

- హైదరాబాద్‌ను వెంటాడుతున్న వర్షాలు.
- నగరవాసులకు సెప్టెంబర్ భయం..
- హైదరాబాద్ నగరాన్ని భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. ముఖ్యంగా సెప్టెంబర్ నెల అంటేనే భాగ్యనగర వాసులు భయపడుతున్నారు. దానికి కారణం.. హైదరాబాద్ చరిత్రలో సెప్టెంబర్ మాసంలో కురిసిన వర్షాలు ఎన్నో చేదు అనుభవాలను మిగిల్చాయి.




**సెప్టెంబర్ నెల వచ్చిందంటే..**
హైదరాబాద్ ప్రజల వెన్నులో వణుకు పుడుతోంది. ప్రతి ఏడాది సెప్టెంబర్ మాసంలో కుండపోత వర్షాలు భాగ్యనగరంలో బీభత్సం సృష్టిస్తున్నాయి. రహదారులు ఏరులై పారుతున్నాయి. 1908వ సంవత్సరంలో మూసీ మహోగ్రరూపం దాల్చడంతో.. భాగ్యనగరం సగభాగం తుడిచిపెట్టుకుపోయింది. అప్పుడు కూడా వరదలు సెప్టెంబర్ నెలలోనే వచ్చాయి. 2000, 2016 సంవత్సరాల్లోనూ ఇదే నెలలో కుండపోత వర్షాలు భాగ్యనగరాన్ని అతలాకుతలం చేశాయి. కేవలం 1908, 2000, 2016 మాత్రమే కాదు.. హైదరాబాద్ చరిత్రలో సెప్టెంబర్ మిగిల్చిన చేదు అనుభవాలు ఎన్నో ఉన్నాయి.

**14 సార్లు వరదలతో అల్లాడిపోయిన హైదరాబాద్..**
1591 నుంచి 1908 వరకు 14 సార్లు హైదరాబాద్ నగరం వరదలతో అల్లాడిపోయింది. 1631, 1831, 1903 సంవత్సరాల్లో భారీ వరదలు సంభవించాయి. అప్పుడు భారీగా ధన, ప్రాణ నష్టం జరిగింది. 1908 సెప్టెంబరు వరదలతో హైదరాబాద్ నగరంలో 2 వేల ఇళ్లు కొట్టుకుపోయాయని చరిత్ర చెబుతోంది.15 వేల మంది మృతి చెందారు. 20 వేల మంది నిరాశ్రయులయ్యారు. అప్పుడు వారం రోజుల పాటు జనజీవనం స్తంభించిపోయింది. 1631లో కుతుబ్ షాహీ ఆరో పాలకుడు.. అబ్దుల్లా కుతుబ్ షా కాలంలో వచ్చిన వరదలకు భవనాలు ధ్వంసం అయ్యాయి. మూసీ నది చుట్టు ప్రక్కల ఉన్న ఇళ్లు వరదలకు కొట్టుకుపోయాయి. వేలాది మంది నిరాశ్రయులయ్యారు.

**సెప్టెంబర్ నెలలోనే..**
1831లో అసఫ్ జాహీ నాలుగో మీర్ ఫరుకుందా అలీఖాన్ నాసరుదౌలా పాలనా సమయంలోనూ.. భాగ్యనగరంలో భారీ వరదలు సంభవించాయి. అప్పుడు నిర్మాణంలో ఉన్న చాదర్‌ఘాట్ వంతెన కొట్టుకుపోయింది. ఆరో నిజాం మీర్ మహబూబ్ అలీ పాలనా కాలం 1903లో సెప్టెంబర్ నెలలోనే భారీ వర్షాలకు హైదరాబాద్ నగరం అతలాకుతలమైంది. 1968, 1984, 2000, 2007, 2016, 2020 సంవత్సరాల్లోనూ భారీ వర్షాలు కురిసి మూసీ నది ఉగ్రరూపం దాల్చింది. అప్పుడు కూడా భారీగా నష్టం వాటిల్లిందని చరిత్ర చెబుతోంది. వేర్వేరు నెలల్లో వర్షాలు వచ్చినా.. సెప్టెంబర్‌లో వచ్చిన వర్షాలే చాలా ఎక్కువ కావడం గమనార్హం.

**చరిత్రలో మర్చిపోలేని రోజు..**
1908వ సంవత్సరం సెప్టెంబరు 28 హైదరాబాద్ చరిత్రలో మర్చిపోలేని రోజు. మూసీ నది 60 అడుగుల ఎత్తున ప్రవహించి.. మహోగ్రరూపం దాల్చింది.
36 గంటల్లో 16 సెంటీమీటర్ల వర్షపాతం నమోదవడంతో.. హైదరాబాద్ అల్లకల్లోలంగా మారింది. మూసీ.. చాదర్‌ఘాట్ దాటి అంబర్‌పేట బుర్జు వరకు.. అటు చార్మినార్ దాటి శాలిబండ వరకు వరద పోటెత్తింది. అప్పుడు ప్రాణాలు కాపాడుకోవడానికి.. పేట్లబురుజు పైకి వందల సంఖ్యలో జనం ఎక్కారు. కానీ.. భారీ ప్రవాహానికి పేట్లబురుజు కూడా కొట్టుకుపోయింది. వందలాది మంది ఆ ప్రవాహంలో కొట్టుకుపోయారు. వేల సంఖ్యలో మృత్యువాత పడ్డారు.

**అక్టోబర్ కూడా..**
కేవలం సెప్టెంబర్ మాసమే కాదు.. అక్టోబర్ కూడా హైదరాబాద్ నగరాన్ని పగబట్టినట్టు ఉంది. అందుకు ఉదాహరణే 2020 అక్టోబర్‌లో వచ్చిన వరదలు. భారీ వర్షాలు పడటం వల్ల హైదరాబాద్‌లోని అనేక ప్రాంతాలను వరదలు ముంచెత్తాయి. భారీ వాహనాలు కూడా వరదలో కొట్టుకుపోయాయి. ప్రాణ నష్టం అంతగా లేకున్నా.. ఆస్తినష్టం మాత్రం భారీగా వాటిల్లింది. దీంతో ప్రభుత్వం ఆర్థిక సాయం చేసింది. అప్పుడు ఇతర రాష్ట్రాలు, సినీ, రాజకీయ ప్రముఖులు విరాళాలు ప్రకటించి.. పేదలను ఆదుకున్నారు. ఇలా దశాబ్దాలుగా హైదరాబాద్ నగరాన్ని సెప్టెంబర్, అక్టోబర్ భయం వెంటాడుతోంది.

## చుట్టుముట్టిన వరద

రికార్డు బద్దలైంది. చరిత్రలో ఎన్నడూ లేనంతగా.. ఒకేరోజు (శనివారం) 29 సెంటి మీటర్ల వర్షపాతం నమోదైంది. శుక్రవారం నుంచి విజయవాడలో కుండపోత వర్షం కురుస్తూనే ఉంది. అనేక కాలనీల్లో నాలుగు అడుగుల మేర నీరు నిలిచింది. ఆటోనగర్ నుంచి బెంజి సర్కిల్ వరకు వర్షపు నీరు నిలిచింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆదివారం కూడా బెజవాడలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో బెజవాడ గజగజ వణికిపోతోంది.

విజయవాడ, గుంటూరు నగరాల్లో అనేక కాలనీలు వరద నీటిలో నానుతున్నాయి. అపార్ట్‌మెంట్ల సెల్లార్లలోకి వర్షపు నీరు చేరి, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం కాలు బయటపెట్టలేని పరిస్థితి నెలకొంది. నగర శివార్లలోని కండ్రిగ వద్ద రహదారిపై భారీగా నీరు నిలవడంతో విజయవాడనూజివీడు మధ్య రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నున్న ప్రాంతంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది నివాసాలు నీటమునిగాయి. రైల్వే ట్రాక్ అండర్ పాస్ వద్ద 4 బస్సులు నీట మునగగా క్రేన్ల సాయంతో అధికారులు...బస్సులను బయటకు తీశారు. మైలవరంలో వెలగలేరు గేట్లు ఎత్తివేశారు. దీంతో చుట్టుపక్కల కాలనీల్లోకి వరద నీరు చేరింది. రాజ రాజేశ్వరిపేట వరద నీటిలో చిక్కుకుంది. సరిగ్గా 20 ఏళ్ల తర్వాత విజయవాడ నగరం ముంపునకు గురైంది. వాగులు, వంకలు ఆక్రమణకు గురైతే ప్రకృతి కన్నెర చేస్తుందని మరోసారి రుజువైంది. 20ఏళ్ల క్రితం చేపట్టిన ఆపరేషన్ కొల్లేరు అర్థాంతరంగా నిలిచిపోవడంతో నేడు దానికి మూల్యం చెల్లించుకుంటున్నారు. 20 ఏళ్లలో విజయవాడ నగరం ఊహించని వేగంగా విస్తరించడం, బుడమేరు ప్రవాహ మార్గాన్ని కబ్జా చేయడమే ప్రస్తుత పరిస్థితికి కారణమైంది.

విజయవాడ నగరానికి పక్కగా ప్రవహించే కృష్ణానది కంటే నగరం మధ్యలో ప్రవహించే బుడమేరుతో దశాబ్దాలుగా దానికి ముప్పు పొంచి ఉంది. 2005లో చివరి సారి బుడమేరు బెజవాడ పుట్టిముంచింది. 2005 సెప్టెంబర్‌లో వచ్చిన భారీ వర్షాలతో నగరం అతలాకుతలమైంది. విజయవాడ మూడొంతులు ముంపునకు గురైంది. వరదల కారణంగా విజయవాడలో కార్పొరేషన్ ఎన్నికలు సైతం వాయిదా పడ్డాయి. దీనికి ప్రధాన కారణం బుడమేరు ఉగ్రరూపంతో ప్రవహించడమే. రికార్డు స్థాయిలో ఎగువన ఖమ్మం జిల్లా నుంచి వరద ప్రవాహం పోటెత్తడంతో అదంతా విజయవాడను ముంచెత్తింది.

తాజాగా బుడమేరు పొంగడంతో సింగ్‌నగర్, చిట్టీనగర్, ఇతర కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. రోడ్లపై 5 అడుగుల మేర నీరు నిలిచిపోయింది. దీంతో మంత్రులంతా వరద ప్రాంతాలలో పర్యటిస్తున్నారు. విజయవాడ ఎంపీ కేశినేని చిన్నితో పాటు మంత్రులు నారాయణ, కొల్లు రవీంద్ర, అధికార యంత్రాంగం వరద ప్రాంతాల్లో పర్యటిస్తూ బాధితులను పరామర్శిస్తున్నారు. నీట మునిగిన కాలనీల్లో జనాన్ని కలిసి ఇబ్బందులను పరిష్కరిస్తున్నారు. వరదలో భయపడొద్దని, అండగా ఉంటామని మంత్రులు భరోసా ఇస్తున్నారు. కృష్ణా నది ఉద్ధృతంగా ప్రవాహిస్తోంది. దీంతో ప్రకాశం బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ప్రకాశం బ్యారేజ్ వద్ద ఇన్ ఫ్లో ,ఔట్ ఫ్లో 7,69,443 క్యూసెక్కులు ఉన్నాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. వాగులు, వంకలు పొంగిపొర్లుతాయని, ప్రజలు అప్రమత్తంగా జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రకాశం బ్యారేజీ దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

అమరావతి ప్రాంతంలో వరద నీరు చేసింది. చాలా ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి. కరకట్ట సమీపంలోకి వరదనీరు చేరుతోంది. హైకోర్టు మార్గంలో వరద నీరు చేరింది. విజయవాడలో గత రెండు రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాలకు రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. వరద నీటిలో కార్లు, ద్విచక్రవాహనాలు కొట్టుకుపోయాయి. 30 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా విజయవాడ విలవిల్లాడింది. పాతబస్తీ, బందరు రోడ్డు, ఏలూరు రోడ్డు, జాతీయ రహదారి, ఆటోనగర్ లో భారీ వరద పోటెత్తింది. విజయవాడ సమీపంలోని జాతీయ రహదారుల నీటిలో చిక్కుకుపోయాయి.

విజయవాడలోని మొగల్రాజపురం వద్ద శనివారం కొండచరియల విరిగి పడ్డాయి. ఈ ఘటనలో ఐదుగురు మృతి చెందారు. అధికారులు శిథిలాలను తొలగిస్తున్నారు. పడిపోయిన కొండరాళ్లను డ్రిల్లింగ్ చేసి, భారీ క్రేన్లతో శిథిలాల తొలగింపు ప్రక్రియ చేపట్టారు. భారీ వర్షాల కారణంగా కొండ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. మొగల్రాజపురం మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.5 లక్షల పరిహారం ప్రకటించింది.

**ఇంద్రకీలాద్రిపై విరిగిపడిన కొండ చరియలు**
విజయవాడలో భారీ వర్షాలకు ఇంద్రకీలాద్రి ఘాట్‌రోడ్ లో కొండ చరియలు విరిగిపడ్డాయి. ఈ ప్రమాదంలో ప్రొటోకాల్ ఆఫీస్, డోనర్ సెల్ ధ్వంసం అయ్యాయి. ఈ ప్రదేశంలో భక్తులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. భారీ వర్షానికి ఘాట్ రోడ్‌లో పలుచోట్ల కొండచరియలు విరిగి పడ్డాయి. ముందు జాగ్రత్త చర్యగా అధికారులు ఘాట్ రోడ్‌ను మూసివేశారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో ఏపీలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎక్కడ చూసిన వరద నీటిలో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. విజయవాడలోని బుడమేరు వాగు పొంగటంతో నగర ఔటర్ పరిధిలో ఉన్న రాయనపాడు రైల్వే స్టేషన్ లోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది రైల్వే స్టేషన్ లో ఉన్న ప్రయాణికులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఆరో బెటాలియన్ ఎస్డీఆర్ఎఫ్ రెస్క్యూ టీమ్ రంగంలోకి దిగి సహాయక చర్యలను చేపట్టింది. రాయనపాడులో నిలిచిపోయిన తమిళనాడు ఎక్స్ ప్రెస్ లోని ప్రయాణికులను రక్షించి, విజయవాడ స్టేషన్ కు తరలించారు. ప్రయాణికులను ప్రత్యేక రైలులో తమిళనాడుకు తరలిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలకు పెద్ద సంఖ్యలో రైళ్లు రద్దయ్యాయి. శనివారం 20 రైళ్లు రద్దు చేయగా... తాజాగా మరికొన్ని రైళ్లు రద్దయ్యాయి. పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. తాజాగా గోదావరి ఎక్స్‌ప్రెస్ సహా 19 రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. భారీ వర్షాలకు పట్టాలపై వరదనీరు చేరడంతో 15 రైళ్లను దారి మళ్లించారు. సికింద్రాబాద్‌భువనేశ్వర్ మధ్య నడిచే విశాఖ ఎక్స్‌ప్రెస్ 2 గంటలు ఆలస్యంగా బయల్దేరనుంది.

## కోర్టు అంటేనే.. భయం

అత్యాచారం వంటి కేసుల్లోనూ తీర్పులు ఆలస్యమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ''అత్యాచారం వంటి కేసుల్లోనూ తీర్పులు వచ్చే సరికి తరం మారుతోంది. న్యాయ ప్రక్రియలో సున్నితత్వం లోపించిందని సామాన్యులు అనుకుంటున్నారు'' అని రాష్ట్రపతి వ్యాఖ్యానించారు. గ్రామాల్లోని ప్రజలు న్యాయాలయాలను దేవాలయాలుగా భావిస్తున్నారని అన్నారు. ''దేవుని ఇంట్లో ఆలస్యం జరుగుతుందేమోగానీ, అన్యాయం మాత్రం జరగదని నమ్ముతుంటారు.

కానీ ఈ అలస్యం ఎంత కాలం? మనమంతా దీనిపై ఆలోచించాలి'' అని హితవు చెప్పారు. ''కొందరికి న్యాయం లభించే సమయానికి వారి ముఖాల్లో నవ్వులు కనిపించడం లేదు. కొందరి జీవితాలు అంతమవుతున్నాయి. దీనిపై మనమంతా దృష్టి పెట్టాలి'' అని అన్నారు. కోర్టు రూముల తీరుపైనా రాష్ట్రపతి అన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కోర్టు రూముల సెట్టింగ్‌ను చూడగానే సామాన్యుల్లో ఒత్తిడి పెరుగుతుందని అన్నారు. దీనికి 'నల్ల కోర్టు లక్షణం' (బ్లాక్ కోర్ట్ సింద్రోం) అన్న పేరు పెట్టారు. దీనిపై అధ్యయనం జరగాలని సూచించారు. న్యాయాధికారుల పోస్టుల్లో మహిళల సంఖ్య పెరుగుతుండడంపై హర్షం వ్యక్తం చేశారు.

సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ ప్రసంగిస్తూ జిల్లా స్థాయి కోర్టుల్లో మహిళా అధికారులు, న్యాయవాదులకు తగిన సౌకర్యాలు లేవని చెప్పారు. కేవలం 6.7శాతం కోర్టుల్లోనే మహిళలకు కనీస సౌకర్యాలు ఉన్నాయని అన్నారు. కొన్ని రాష్ట్రాల్లో 6070 శాతం మేర మహిళలను న్యాయాధికారులుగా భర్తీ చేస్తున్నారని, అలాంటప్పుడు వారికి కావాల్సిన సౌకర్యాలు కల్పించాల్సి ఉందని చెప్పారు.

## వర్షాలపై సోయిలేదు..

మంత్రులకు సోయిలేదు కానీ ఢిల్లీకి మాత్రం 20 సార్లు చకర్లు కొట్టారంటూ మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ విమర్శించారు. వర్షాలతో మహబూబాబాద్ జిల్లా తీవ్రంగా నష్టపోయిందని, అక్కడి ప్రజలను, రైతులను ఆదుకోవాలని కోరారు. కేసీఆర్ ప్రజల్లోకి వస్తారని కాంగ్రెస్ నాయకులకు భయం పట్టుకున్నదని ఎద్దేవాచేశారు. ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కేపీ వివేకానందతో ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల్లోకి ఎందుకు రాకూడదో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చినందుకు రావద్దా అంటూ నిలదీశారు. కేసీఆర్ గురించి మాట్లాడే నైతిక హకు సీఎం, మంత్రులకు లేదని, కేసీఆర్ కొట్లాడి రాష్ట్రం తెస్తేనే సీఎం, మంత్రులు అయ్యారనే విషయాన్ని భట్టి గుర్తు పెట్టుకోవాలని హితవుపలికారు. కేసీఆర్‌కు ప్రజల్లో ప్రత్యేక స్థానం ఉన్నదని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు తన వంతు బాధ్యత నిర్వర్తిస్తారని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార మనస్తాపం చెందినప్పుడు ఏదో ఒకటి మాట్లాడుతారంటూ ఎద్దేవాచేశారు. కాంగ్రెస్ నేతలను చూసి ప్రజలు ఓట్లెయ్యలేదని, ఆ పార్టీ మ్యానిఫెస్టోను చూసి ఓట్లేసి మోసపోయారని చెప్పారు. మ్యానిఫెస్టోలో ఉన్న హామీల్లో ఎన్ని అమలు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. రుణమాఫీపై వ్యవసాయ శాఖ మంత్రిని రైతులు అడ్డుకున్న విషయాన్ని గుర్తుచేశారు. ఎమ్మెల్సీ కవిత బెయిల్‌పై ఇష్టంవచ్చినట్టు మాట్లాడిన రేవంత్‌రెడ్డికి సుప్రీంకోర్టు చీవాట్లు పెట్టిందని, అయినా ఆయనలో మార్పు రాలేదని విమర్శించారు.

దేశంలో అత్యంత అవినీతి ప్రభుత్వంగా తెలంగాణ కాంగ్రెస్ సరార్ నిలిచిందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద దుయ్యబట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి దిగజారి మాట్లాడుతున్నారని, సీఎం పదవిని అప్రతిష్టపాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి తన భాషను డిప్యూటీ సీఎం, మంత్రులకు నేర్పించి, వారితో కేసీఆర్‌ను తిట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ పాలనపై ప్రజలు విసుగుచెంది, కేసీఆర్ పాలన మళ్లీ రావాలని కోరుకుంటున్నారని చెప్పారు. వర్షాలు, వరదలపై సీఎం, మంత్రులు క్షేత్రస్థాయిలో పర్యటన చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద రేవంత్‌రెడ్డి స్థాయి తగ్గిపోయిందని, ఇప్పటి వరకు మంత్రులను, టీపీసీసీ చీఫ్ పదవులను ఆయన భర్తీ చేసుకోలేకపోవడమే ఇందుకు నిదర్శమని తెలిపారు.

హైడ్రాకు మార్గదర్శకాలేవీ లేవని, చట్టబద్ధత కూడా లేదని, హైడ్రా పేరుతో కాంగ్రెస్ నాయకులు దందాలు చేస్తున్నారని విమర్శించారు. సీఎం తమ్ముడి ఇంటికి నోటీసులు మాత్రమే ఇచ్చారని, పేదల ఇండ్లను మాత్రం చెప్పాపెట్టకుండా కూల్చివేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో హైదరాబాద్ ఎప్పుడూ అభివృద్ధి చెందలేదని గుర్తుచేశారు. ఎక్కువ కాలం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీయే నగరంలో అత్యధిక అక్రమ నిర్మాణాలకు అనుమతులిచ్చిందని చెప్పారు. కాంగ్రెస్ నేతలు చెరువులను కబ్జా చేసి ఇండ్లు నిర్మించారని, రియల్ ఎస్టేట్ కోసమే ఫోర్త్ సిటీ అని ఆరోపించారు. స్వేర్ ఫీట్‌కు వంద చొప్పున బిల్డర్ల నుంచి వసూలు చేస్తున్నారని, కాంగ్రెస్ నేతల దందాలను బయటపెడతామని వివేకానంద ప్రకటించారు.

# ఆరోపణలు చేస్తే సహించేది లేదు

- మాజీలపై విరుచుకుపడ్డ స్థానిక కార్పొరేటర్ ప్రసన్న లక్ష్మీ శ్రీదర్ రెడ్డి
- రద్దయిన పి అండ్ టి కాలనీ అసోసియేషన్ కమిటి



**జయభేరి, మేడిపల్లి, సెప్టెంబర్01:**

నిరాదరణ ఆరోపణలు చేస్తు పి అండ్ టి కాలనీ మాజి అధ్యక్షుడు జక్క సుదాకర్ రెడ్డి పబ్బం గడుపుతున్నాడని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 13వ డివిజన్ కార్పొరేటర్ ప్రసన్న లక్ష్మీ శ్రీదర్ రెడ్డి తెలిపారు.ఆదివారం పి అండ్ టి కాలనీ కమ్యూనిటీ హాల్ జనరల్ బాడి సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో కాలనీ అసోసియేషన్ కమిటీ రెండు సంవత్సరాల సమయం ముగియడంతో కాలనీవాసులందరు ఏక పక్షంగా కమిటీని రద్దు చేసినట్లు ప్రకటించారు.అనంతరం గణేష్ ఉత్సవాలను జరుపుట కోసం ఉత్సావంతుల తో హడక్ కమీటిని ప్రకటించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రసన్న లక్ష్మీ శ్రీదర్ రెడ్డి మాట్లాడుతూ పి అండ్ టీ కాలనీ స్వచ్ఛతకు,పరిశుభ్రతతో పాటు ప్రశాంతతకు కార్పొరేషన్ కు ఆదర్శంగా ఉంటుందని,అన్ని రకాలుగా అభివృద్ధి చెందిన డివిజన్ నిలిచిందని తెలిపారు.మాజి అధ్యక్షుడు జక్క సుదాకర్ రెడ్డి కొంత మంది మాజీల మాటలు విని నాతో పాటు మా భర్తపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నాడని వాటన్నింటిని నా భర్త విని సహించాడని,అలాంటి నా కుటుంబం గురించి నా ముందు అంటే అక్కడే చెప్పుతో కొట్టేదానినని వాపోయారు.లేనిపోని నిరాదరణలు చేసి పబ్బం గడుపుకోవాలని కొంతమంది మాపై కక్ష్య కట్టారని మాకు కాలనీప్రజల అండదండలు పుష్కలంగా ఉన్నాయని అన్నారు.కాలనీకి వచ్చి పదిహేను సంవత్సరాలు గడిచిందని వచ్చిన మూడు సంవత్సరాలలోనే నా భర్త శ్రీదర్ రెడ్డి కాలనీ అధ్యక్షులుగా నేను కార్పొరేటర్ గా గెలిచానంటేమా మంచితనం ఏంటే ప్రజలకు తెలుసని వారి ఆదరాభిమానాలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామన్నారు.వెంకటేశ్వర టెంపుల్ నిర్మించడం కోసం కమిటీని వేసి విరాళాలు సేకరించి పారదర్శకంగా నిర్మాణం చేస్తుంటే తట్టుకోలేక అధ్యక్షునిగా ఉన్నా సుదాకర్ రెడ్డి వసులు చేసిన డబ్బులను తిన్నారని అవహేలనగా మాట్లాడి అందరు మందలించడంతో నేను ఏదో పొరపాటున మాట్లాడనని తప్పయిందని ఒప్పుకోవడం ఆయనకు కాలనీపై,కార్పొరేటర్ పై కక్ష్య ఏంటో కాలనీవాసులకు అర్థమయిందని పేర్కొన్నారు.

**కాలనీవాసుల అండతో గుడి నిర్మాణం :**

పి అండ్ టి కాలనీ దాతలతో పారదర్శకంగా గుడి నిర్మాణం చేపడుతున్నామని ఆలయ కమిటీ చైర్మన్,అద్యక్షకార్యదర్శులతో పాటు సభ్యులు తెలిపారు.శ్రీ వెంకటేశ్వర స్వామి గుడి నిర్మాణం చేపట్టడం కోసం కాలనీ వాసులు విజయ్ కుమార్ గుప్త చైర్మన్ గా,స్థానిక కార్పొరేటర్ ప్రసన్న లక్ష్మీ శ్రీదర్ రెడ్డి ఆద్వర్యంలో చిన్నజీయర్ స్వామీ ఆశీస్సులతో నిర్మాణానికి పూనుకున్నామని తెలిపారు. దాతలు విరాళంగా ఒక కోటి యాబై లక్షలు చందాలు రాయగా వచ్చినవి తొంబై ఆరు లక్షలు చెక్కులు నగదు రూపంలో వచ్చాయని, గుడి నిర్మాణం కోసం తొంబై లక్షల వరకు ఖర్చు అవగా ఆరు లక్షల వరకు బ్యాలెన్స్ ఉందని పూర్తి లెక్కల రూపంలో కమిటీ సభ్యులు తెలిపారు.దీనిలో ఎలాంటి దాపరికాలు లేవని మాజి అధ్యక్షుడు జక్క సుదాకర్ రెడ్డితో పాటు కార్పొరేటర్ గిట్టని వారు కొంతమంది చైర్మన్ పై లేనిపోని ఆరోపణలు చేస్తు దేవుడిపై కూడ రాజకీయ కక్ష్యసాదింపు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు.ఈ సమావేశంలో కాలనీ అసోసియేషన్ కమిటీ సభ్యులు,కాలనీ వాసులు,ఆలయ కమీటీ సభ్యులు పాల్గొన్నారు.



# బీసీ గురుకుల పాఠశాలను సందర్శించిన మాజీ మంత్రులు

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మండల కేంద్రంలోని కొండభిమనపల్లి బీసీ గురుకుల పాఠశాలలో రాత్రి పూట నిద్రిస్తున్న విద్యార్థులలను కోరికిన 14 మంది విద్యార్థులకు ఎలుకలు కరిచి గాయాలు అయినా విద్యార్థులకు మాజీ మంత్రి హరీష్ రావుతో పాటు గుంటకండ్ల జగదీష్ రెడ్డి, గంగుల కమలాకర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, రాష్ట్ర నాయకులు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు ఆర్. రవీంద్ర కుమార్, డా. గాదరి కిశోర్ కుమార్, ఎన్. భాస్కర్ రావు, పెద్ది సుదర్శన్ రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి తదితరులు కొండభీమనపల్లి బీసీ గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్, ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ గురుకులాల పితామహుడు కేసీఆర్ హయాంలో గురుకులాలు ఎంతో ఘనకీర్తి సాధించాయని, నేడు కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలపై, విద్యార్థులపై కక్ష్య తీర్చుకుంటున్నారని అన్నారు.గురుకులాలు అద్వాన్నంగా తయారయ్యాయని, విద్యా



ర్థుల పరిస్థితి దయనీయంగా మారిందని,ఎలుకలు, పాములు కరిచి ఫుడ్ పాయిజన్ ఐ చనిపోతున్నారని అన్నారు.గురుకుల స్కూల్ లు కూలిపోతున్నాయని గుర్తు చేశారు. విద్యార్థులు బిక్కు బిక్కు మంటు గడుపుతున్నారని అన్నారు.7 లక్షల మంది విద్యార్థులు చదువుతున్న గురుకులల్లో కనీస సదుపాయాలు లేవని, 4 నెలలుగా జీతాలు రావడం లేదని వాపోయారు.రేవంత్ రెడ్డి ఇదేనా ప్రజా పాలన అని,నిధులు అన్ని ఎక్కడికి పోతున్నాయని హెచ్చరించారు. హైడ్రా కోబ్రా అంటూ సీఎం డివర్ట్ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు.బీసీ బిడ్డలు చదువుకునే గురుకులాలు అద్వాన్నంగా తయారయ్యాయని, 320 బీసీ గురుకులాలను ఏర్పాటు చేసిన కేసీఆర్ హయాంలో గురుకులా లు స్వర్ణమందిరాల్లుగా వర్ధిల్లాయని అన్నారు. ఇప్పుడు గురుకులాలు అంటే భయం వేస్తుందని అన్నారు.వ్యవస్థ మొత్తం కుప్పకూలిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.



గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి ఫీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని 10వ డివిజన్, మల్లికార్జున నగర్ కాలనీ వాసులు, వర్షపునీరు నిలిచిఉండటంతో తీవ్ర ఇబందులు ఎదుర్కొంటున్నారు. నీటి మధ్యలో ట్రాన్స్ఫార్మర్ ఉండటంతో భయాందోళనలో ఉన్నారు. అక్కడి ప్రజలు. కావున సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కారం చేయవలసిందిగా కోరుతున్నారు.

**జయభేరి, మేడిపల్లి**

# విహారిక కాలనీ సి సెక్టార్ కాలనీ ఎన్నికలు ఏకగ్రీవం..

- అధ్యక్షునిగా నాయిని రవీందర్ రెడ్డి

**జయభేరి, మేడిపల్లి, సెప్టెంబర్01:**



పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 25వ డివిజన్ పరిదిలోని విహారిక కాలనీ సి సెక్టార్ కాలనీ అసోషియేషన్ ఎన్నికలలో అధ్యక్ష కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలు స్థానిక కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి పాల్గొని సలహాదారులు రామకోటి, వీరయ్య, నాగార్జున సమక్షంలో కాలనీవాసులు ఏకగ్రీవంగా కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా నాయిని రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా బి.సంధ్య, ఏ.రమాదేవి, డి.రవి నాయక్, సిహెచ్.శ్రీశైలం గౌడ్, ప్రధాన కార్యదర్శి సిహెచ్.విజయ్ కుమార్,సంయుక్త కార్యదర్శులుగా క్రిష్ణమోహన్, జె.అశోక్, బి.నరసింహారెడ్డి, జి.లక్ష్మీ, నిర్వహణ కార్యదర్శులుగా ఇ రజిని, పి డా. కిరణ్, సంస్కృతి కార్యదర్శి కె.సూరిబాబులను నియమించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి నూతన కార్యవర్గ సభ్యులను, కమిటీ సభ్యులను శాలువతో సన్మానించి పూలబొకేను అందించి శుభాకాంక్షలు తెలిపారు. మాజి అధ్యక్షుడు అశోక్ రెడ్డి,కార్యదర్శి రాజు కుమార్ నాయక్, కార్యవర్గ కమిటీ సభ్యులను అభినందించి వీడ్కోలు పలుకుతూ శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అధ్యక్షునిగా ఎన్నుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలు

- విద్యార్థుల సమస్యలపై పోరాటాలు..
- ప్రభుత్వ నిర్బంధంలో జైలు జీవితం..
- రాష్ట్ర యువమోర్చా కార్యవర్గ సభ్యుడిగా రాగం అర్జున్

**జయభేరి, మేడ్చల్ :**




సమాజంలో మార్పు రావాలంటే నీతివంతమైన నిజాయితీ గల నాయకుల వల్లే సాధ్యమనే ఉద్యేశ్యంతో చిన్నతనం నుండి రాజకీయాల పట్ల మక్కువతో మేడ్చల్ జిల్లా గిర్మాపూర్ గ్రామానికి చెందిన రాగం అర్జున్ విద్యార్థిదశ నుండి అఖిల భారత విద్యార్థి పరిషత్ లో చేరి ఎప్పటికప్పుడు విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వాలను ప్రశ్నిస్తూ తన పోరాటాలను మొదలుపెట్టాడు. డబ్బులతో ముడిపడిన నేటి రాజకీయాల్లో పేద మధ్యతరగతి కుటుంబం నుండి వచ్చిన అర్జున్ ఏబీవీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ బిజెపి జిల్లా, రాష్ట్ర నాయకుల దృష్టిని ఆకట్టుకున్నాడు. 2009 సంవత్సరంలో ఏబీవీపీ మేడ్చల్ మండల ఇంచార్జ్ గా తన రాజకీయ జీవితాన్ని మొదలుపెట్టిన అర్జున్ 2011 సంవత్సరంలో ఏబీవీపీ బోయినపల్లి బాగ్ కన్వీనర్ గా బాధ్యతలు చేపట్టాడు. తదనంతరం 2014 లో మేడ్చల్ జోనల్ ఇంఛార్జిగా, 2015 లో జిల్లా కో కన్వీనర్ గా విద్యార్థి సంఘం నాయకుడిగా బాధ్యతలు నిర్వర్తించాడు. అనంతరం మేడ్చల్ జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు పట్లోళ్ళ విక్రమ్ రెడ్డి ప్రోత్సాహంతో పూర్తిస్థాయి రాజకీయాల్లోకి అడుగు పెట్టిన అర్జున్ 2016 నుండి 2019 సంవత్సరం వరకు మేడ్చల్ జిల్లా బిజెవైఎం కార్యదర్శిగా, 2019 నుండి 2023 వరకు జిల్లా బిజెవైఎం ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి యువమోర్చా ఆధ్వర్యంలో ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై అనేక పోరాటాలు చేసి మేడ్చల్ జిల్లాలో మంచి పేరు తెచ్చుకున్నాడు.

**ప్రభుత్వ విధానాలపై పోరాటాలు**

2011 సంవత్సరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి ఉన్న సమయంలో విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఎం క్యాప్ ఆఫీస్ ముట్టడిలో పోలీసులు పెట్టిన కేసులతో దాదాపు 5 రోజులు జైలుకు వెళ్ళాడు. పేద విద్యార్థులకు స్కాలర్ షిప్స్ అందించాలని 2014 సంవత్సరంలో అప్పటి మంత్రి ఈటల రాజేందర్ కాన్వాయిని అడ్డుకున్నందుకు పోలీసులు పెట్టిన కేసులో దాదాపు 10 సంవత్సరాలు కోర్టుల చుట్టూ తిరగడం జరిగింది. అలాగే కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో టీఎస్పీఎస్ నిరుద్యోగులకు మద్దతుగా చేపట్టిన ధర్నాలో, కొన్ని మతాలకు చెందిన కొందరు గోవధ చేయడాన్ని వ్యతిరేకిస్తూ అక్రమంగా గోవులను తరలిస్తున్న వాహనాలను అడ్డుకున్నందుకు ఇలా ప్రభుత్వం, పోలీసులు అనేక కేసుల పెట్టిన తన పోరాటాలను కొనసాగిస్తూ నేడు రాష్ట్ర బిజెవైఎం కార్యవర్గ సభ్యుడి వరకు చేరుకున్నాడు.

**విద్యార్థుల సమస్యలపై పోరాటాలు**

తెలంగాణ ప్రత్యేక రాష్టం కోసం సాగిన మలిదశ ఉద్యమంలో విద్యార్థి నాయకుడిగా రాగం అర్జున్ చురుకుగా పాల్గొన్నాడు. మేడ్చల్ ప్రాంతంలోని పేద విద్యార్థుల ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ పై చదువులకు దూరం కావొద్దని మేడ్చల్ లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో అప్పటి మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి వ్యతిరేకంగా రాస్తారోకో, ధర్నాలు చేయడం జరిగింది. అలాగే క్రీడాకారులకు మేడ్చల్ లో ఏర్పాటు చేసిన క్రీడప్రాంగణం పూర్తి చేయాలని, విద్యార్థులకు ఫీస్ రీయింబర్స్మెంట్ అందించాలని మండల కేంద్రాల్లో, హైదరాబాద్ లో చేపట్టిన అనేక పోరాటాలో పాల్గొని ప్రభుత్వానికి నిరసన తెలిపారు. అలానే తెలంగాణ ఏర్పాటు తర్వాత జిల్లాల పునర్వ్యవస్థీకరణ లో అప్పటి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుండి మరో జిల్లా ఏర్పాటు చేస్తున్న సమయంలో ఆ జిల్లాకు మేడ్చల్ పేరు పెట్టాలని డిమాండ్ చేస్తూ మేడ్చల్ జిల్లా సాధన సమితి చేసిన పోరాటాల్లో విద్యార్థి విభాగంలో అర్జున్ కీలకంగా వ్యవహరించాడు.

**కుటుంబ నేపథ్యం..**

మేడ్చల్ జిల్లాలోని గిర్మాపూర్ గ్రామంలో ఓ దళిత కుటుంబంలో అర్జున్ జన్మించాడు తల్లిదండ్రులు రాగం సంజీవశారదా కు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. కుటుంబంలో అర్జున్ చిన్నవాడు. పేద దళిత కుటుంబంలో జన్మించిన రాగం అర్జున్ ప్రభుత్వ పాఠశాలలో విద్యను పూర్తి చేసుకున్నాడు. 2015లో బీకాం డిగ్రీ పూర్తి చేశాడు. చిన్నతనంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ చేరి ప్రదామవర్ష పూర్తి చేశాడు. రాజకీయాల పై ఉన్న మక్కువతో విద్యార్థి విభాగంలో పనిచేస్తూ ప్రస్తుతం భారతీయ యువమోర్చా లో రాష్ట్ర స్థాయిలోరాజకీయ జీవితాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నాడు.



# పుట్టినరోజు శుభాకాంక్షలు

- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

**జయభేరి, మేడ్చల్ :**

మేడ్చల్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సి హెచ్. దయానంద్ యాదవ్ కు మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంభిపూర్ రాజులు పుట్టిన రోజులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ల నివాసాలకు వెళ్లిన దయానంద్ యాదవ్ కు శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. దయానంద్ యాదవ్ మాట్లాడుతూ తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంభిపూర్ రాజులతో పాటు, నాయకులకు, కార్యకర్తలకు, ప్రజాప్రతినిధులకు, అభిమానులకు ధన్యవాదాలు తెలియజేస్తూన్నానన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపాలిటీ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు భాస్కర్ యాదవ్ పాల్గొన్నారు.

# సహాయక చర్యలలో ముందు ఉండాలి

- మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు



**జయభేరి, దేవరకొండ :**

వాయుగుండంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయని,ప్రభుత్వం వెంటనే స్పందించి ఎక్కడికక్కడ అత్యవసర సేవలందించేందుకు బృందాలు ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు అన్నారు. ఆదివారం దేవరకొండకు గురుకుల సందర్శించిన అనంతరం పత్రికా విలేకరులతో మాట్లాడుతూ అవసరమైతే సైన్యం సహాయం తీసుకోవాలని,ప్రత్యేక హెలికాప్టర్ లు తెప్పించాలని,పూర్తిగా నిండిన చెరువులు కాలువలు తెగకుండా ఇరిగేషన్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఎక్కడికక్కడ ఆపదలో ఉన్న బాధితులకు సహాయక చర్యలు అందించాలని కోరారు. మరో రెండు రోజులు భారీ వర్షాలు ఉన్నాయని,ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేసారు. అధికారులకు సెలవులు రద్దుచేసి 24 గంటలు అప్రమత్తంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

# కేసి గుప్తా జయంతి వేడుకలు



**జయభేరి, దేవరకొండ :**

శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో సాయంత్రం వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ వారు కే సి గుప్తా జయంతి సందర్భంగా కేసీ గుప్త చిత్రపటానికి పూలమాలలు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫ్రూట్స్ స్నాక్స్ వితరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు తోనుకునూరి విజయ కార్యదర్శి మంచి కంటి పద్మ కోశాధికారి కుంచకూరి శిరీష వాసవి క్లబ్ అధ్యక్షులు నీలా బిక్షమయ్య కోశాధికారి కండే సత్యం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చీదెల్ల వెంకటేశ్వర్లు కోశాధికారి కొత్త సుబ్బారావు ఐపీసీ గోవిందు కొండయ్య శైలజ మేడం తదితరులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ఒక 15 నిమిషాల ధ్యానం చేసినారు. ధ్యానం చేయడం వల్ల మన ఆరోగ్య వయసు పెరుగుతుందని మనసు ఎంతో ఉల్లాసంగా ఉంటుందని మనందరికీ ధ్యానం ఎంతో అవసరమని ప్రతి ఒక్కరూ ప్రతిరోజు ప్రతి ఒక్కరు ఏదో ఒక సమయంలో ధ్యానం చేయాలని అధ్యక్షురాలు తణుకునూరు విజయ తెలియజేసినారు.

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం

- పూర్వ విద్యార్థులం, మేము అపూర్వ విద్యార్థులం



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలోని విద్యా భారతి హై స్కూల్ లో 2003, 04 10 వ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం పట్టణంలోని పి పి ఆర్ ఫంక్షన్ హాల్ లో ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. అప్పట్లో విద్యార్థులకు బోధన చేసిన ఉపాధ్యాయులు దేపా పద్మా రెడ్డి, అనిల్, రవీందర్ రెడ్డి,ఖలేఖ్ లను విద్యార్థులు పాదాభివందనం చేసి, శాలువలతో పూలతో మెమొంటోలతో సత్కరించారు. 20 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు ఒకే చోట కలవడం చాలా సంతోషంగా ఉందని, అప్పటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమతో పాటు చదువుకొని మృతి చెందిన తమ మిత్రులకు ఘనంగా నివాళి అర్పించి, శ్రద్ధాంజలి ఘటించారు. ఉద్యోగాలు, వ్యాపారాలు, వ్యవసాయంలో స్థిరపడిన ఆనాటి పదో తరగతి విద్యార్థులు ఒకరినొకరు పరిచయం చేసుకొని పాత జ్ఞాపకాలను గుర్తు చేస్కుంటూ వారు చేస్తున్న వృత్తి, ఉద్యోగాలు తెలుసుకొని, వారికి పాఠాలు నేర్పిన గురువులను సత్కరించి, వారిపట్ల గౌరవాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో గుర్తుండే తీపి జ్ఞాపకాలు చిన్నతనంలోనే ఉంటాయని,ఇక్కడ చదవిన విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి దేశ, విదేశాల్లో అత్యున్నత స్థానాల్లో స్థిరపడ్డారని, ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలని, తల్లి,దండ్రులను అత్త,మామలను గౌరవించి వారి ఆశీస్సులను ఎప్పుడు పొందాలని అన్నారు. వేడుకల్లో కర్నాటి శ్రీను, మార్కొండయ్య, వెంకటేష్, సలీం,విజయ్, జ్ఞానేశ్వర్, కిరణ్, కరుణాకర్, సుహాసిని,తైసీన్, శిరీష, ఝాన్సీ, వీణ,రేణుక, లక్ష్మీ ప్రసన్న,రమేష్, చందర్, రాజు, వెంకటరెడ్డి, రంజిత్,దేవదాస్, ఇర్మియా, కళ్యాణ్, శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

# కళలను గుర్తించే రోజులు రావా!?

దిలీప్ ప్రకాష్, రెజీనా కసాండ్రా జంటగా రూపొందిన చిత్రం 'ఉత్సవం'. అర్జున్‌సాయి రచన, దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి సురేశ్ పాటిల్ నిర్మాత. ఈ నెల 13న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. బ్రహ్మానందం స్టేజ్ ప్లేలో చెప్పిన పవర్‌ఫుల్ డైలాగ్‌తో ట్రైలర్ మొదలైంది. 'మన బ్రతుకులు కలలు కావు.. కళలని గుర్తించే రోజులు రావా..' అని ప్రకాశ్‌రాజ్ చెప్పిన డైలాగ్ కథలోని ఆత్మని ప్రజెంట్ చేసింది. నాటకరంగం చుట్టూ సాగే కథాంశంతో ఈ సినిమా తెరకెక్కినట్టు ట్రైలర్ చెబుతున్నది. ఇందులో కృష్ణగా దిలీప్‌ప్రకాశ్, రామగా రెజీనా కసాండ్రా కనిపిస్తారు. వారి ప్రేమకథ ఈ సినిమాలో ప్రధాన ఆకర్షణ అని మేకర్స్ చెబుతున్నారు. ప్రేమ, భావోద్వేగాల మేళవింపుగా తెరకెక్కిన ఈ చిత్రంలో రాజేంద్రప్రసాద్, నాజర్, అలీ, ప్రేమ, ఎల్బీ శ్రీరామ్, అనీష్ కురువిల్లా, ప్రియదర్శి, ఆమని, సుధ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: రసూల్ ఎల్లోర్, సంగీతం: అనూప్ రూబెన్స్.



# తొలి ప్రయారిటీ తెలుగుకే..

త్రిష నటించిన సూపర్‌హిట్ వెబ్ సిరీస్ 'బృందా'లో త్రిష చెల్లెలు 'చుట్కీ'గా అందరి దృష్టినీ ఆకర్షించింది నటి యష్నా. నటనకు అవకాశం ఉన్న పాత్ర కావడంతో ఆడియన్స్‌కి బాగా రిజిస్టర్ అయ్యింది యష్నా. ఈ సిరీస్ కంటే ముందే నాగార్జున 'బంగార్రాజు'లో కూడా నాగచైతన్య కాంబినేషన్‌లో మంచి పాత్ర పోషించింది. ఆకర్షణీయమైన రూపం, అభినయ సామర్థ్యం యష్నాకు వరాలు. 'బృందా' సిరీస్ తర్వాత ఈ తెలుగమ్మాయికి తెలుగుతోపాటు తమిళ, మలయాళ, కన్నడ భాషల నుంచి కూడా అవకాశాలు వస్తున్నాయి. కానీ తన తొలి ప్రయారిటీ తెలుగు సినిమాకే అని చెపుతున్నది యష్నా. త్వరలో మరికొన్ని సినిమాల్లో ఈ తెలుగుఅందం తళుక్కున మెరవనున్నది.





# వచ్చే నెల నుంచి కొత్త ప్రయాణం

రామ్‌చరణ్ సరికొత్త అవతారంలోకి మారారు. అక్టోబర్ నుంచి ఆయన బుచ్చిబాబు సాన సినిమా షూటింగ్‌లో జాయిన్ కానున్నారు. ఆ సినిమాకోసం గత రెండు నెలలుగా జిమ్‌లో ఎక్కువ సమయం గడుపుతున్నారు రామ్‌చరణ్. శంకర్ 'గేమ్‌చేంజర్' సినిమాకు సంబంధించిన షూటింగ్ వర్క్‌ని ఇప్పటికే ఆయన పూర్తి చేసుకున్నారు. ఆ సినిమా డబ్బింగ్ మాత్రమే బ్యాలన్స్ ఉంది. దానికి ఈ నెలలోనే ఓ పది రోజులు కేటాయించనున్నారు. వచ్చే నెల నుంచి బుచ్చిబాబు సినిమా షూటింగ్‌లో జాయిన్ అవుతారు. ఈ సినిమాలో రామ్‌చరణ్ లుక్‌ని డిఫరెంట్‌గా ప్లాన్ చేశారట బుచ్చిబాబు. అందుకే.. మామూలుగా కంటే ఓ గంట ఎక్కువగానే జిమ్‌లో కష్టపడుతున్నారట చరణ్. క్రీడా నేపథ్యంలో సాగే పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కనుంది. ఇది ఇప్పటి జనరేషన్ కథ కాదని, బుచ్చిబాబు ఓ 30ఏళ్లు వెనక్కెళ్లి రాసుకున్న వైవిధ్యమైన కథ అని యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. అయితే.. ఏ క్రీడా నేపథ్యంలో ఈ కథ సాగుతుందో మాత్రం చిత్రబృందం చెప్పడంలేదు. అది తెరపైనే చూడాలి. జాన్వీ కపూర్ ఇందులో కథానాయికగా నటించనున్న విషయం తెలిసిందే. నవంబర్ నుంచి జాన్వీ ఈ షూటింగ్‌లో పాల్గొంటుందని సమాచారం.

## ఆయన ప్లాన్ చేస్తే

# నేను రెడీ..

ప్రశాంత్‌నీల్‌తో ఎన్టీఆర్ చేయబోతున్న సినిమాకు సంబంధించిన తాజా అప్‌డేట్ ఆదివారం వెలుగు చూసింది. ఆ చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీమూవీ మేకర్స్ తన ఎక్స్(ట్విటర్)లో ఈ అప్‌డేట్‌ని పొందుపరిచింది. 'ఎన్టీఆర్, కొరటాల శివతో మేం చేసిన 'జనతా గ్యారేజ్' విడుదలై ఎనిమిదేండ్లు కావొస్తున్నది. ఈ సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ వారిద్దరూ 'దేవర 1'తో రాబోతున్నారు. ఈ సినిమా కూడా ఘన విజయం సాధించాలని ఆశిస్తున్నాం. అలాగే.. ఎన్టీఆర్, ప్రశాంత్‌నీల్‌తో మేం చేయనున్న భారీ ప్రాజెక్ట్‌ని కొన్ని నెలల్లోనే మొదలుపెట్టనున్నాం. ఈ విషయం తెలియజేయడానికి సంతోషిస్తున్నాం' అని ఎక్స్ ద్వారా వారు తెలిపారు. ఇదిలావుంటే.. కర్ణాటకలోని ఉడిపి దేవాలయ ప్రాంగణంలో ఎన్టీఆర్ మీడియాతో ముచ్చటించినప్పుడు. ' 'కాంతార' ప్రీక్వెల్‌లో మీరు నటిస్తారని జాతీయ మీడియాలో గత కొన్ని రోజులుగా కథనాలు వస్తున్నాయి. వాటిలో నిజమెంత? అని ఓ విలేకరి ప్రశ్నించగా.. 'రిషబ్‌శెట్టే దానికి ప్లాన్ చేయాలి. ఆయన ప్లాన్ చేస్తే చేయడానికి నేను రెడీ..' అన్నారు తారక్. ఈ రెండు విషయాలకూ సంబంధం లేకపోయినా.. తారక్ అభిమానులకు మాత్రం ఇవి శుభవార్తలే.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com